క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

130 కిలోల గంజాయి స్వాధీనం

సింహాచలం: కారులో తరలిస్తున్న 130 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ నగర ఏసీపీ ఎ.త్రినాథరావు తెలిపిన వివరాలు ప్రకారం.. కేరళకు చెందిన కె.బి.శశికుమార్ అనే వ్యక్తి ఆదివారం కారులో 130 కిలోల గంజాయిని తరలిస్తుండగా పెందుర్తి జంక్షన్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రెండు ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని పెందుర్తి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుల్లాట నిర్వహిస్తున్న నలుగురిపై కేసు

సబ్బవరం: ఆదిరెడ్డిపాలెం శివార్లలో సోమవారం గుల్లాటస్థావరాలపై దాడులు నిర్వహించి, నలుగురు నిర్వాహకులను పట్టుకున్నట్టు సీఐ రంగనాథం తెలిపారు. రెండు చోట్ల నిర్వహిస్తున్న ఈ గుల్లాటలో నిందితుల వద్ద నుంచి రూ.3,160, రూ.3,210 చొప్పున నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.పట్టబడిన వారిలో పళ్ల వెంకటేష్, పితాని ఎర్నిబాబు, సమ్మంగి అప్పలస్వామి, తలారీ నానాజీ ఉన్నారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.


మూగ జీవాల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుజాత

సింహాచలం: మూగజీవాలను సంరక్షించడం అందరి బాధ్యత అని కోటనరవ పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.సుజాత తెలిపారు. పెందుర్తి మండలం నరవ హైస్కూల్లో సోమవారం మూగజీవాల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సుజాత మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కామేశ్వరి, ఆస్పత్రి ఉద్యోగి వి.కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం సందర్శన



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ: జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సోమవారం విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఇక్కడ ఖైదీల బేరక్‌లు, వంటశాల, ఆస్పత్రి తదితర వాటిని పరిశీలించారు. సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రిమాండ్ ఖైదీలకు న్యాయపరమైన విధానాలపై అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ గురించి తెలియజేశారు. ఖైదీలు న్యాయ సేవాధికార సంస్థ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జైల్ అధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు



దేవీపురంలోని రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్న రాజశ్యామలా హోమం



ఆదిరెడ్డిపాలెంలో పూజలందుకున్న సత్తివమ్మ తల్లి



పూజలందుకున్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరిదేవి పీఠంలో నిర్వహించిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల అమ్మవారికి క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. యూకేకి చెందిన వ్యక్తి రాజశ్యామలా హోమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి సహస్ర చండీ హోమాన్ని కెనడాకు చెందిన జీఆర్‌డీ అయ్యర్స్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఈ హోమాన్ని ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్టు చెప్పారు. లోక కళ్యాణమే ప్రధాన సంకల్పంగా దీనిని నిర్వహించనున్నట్టు అన్నపూర్ణమ్మ తెలిపారు.

ఘనంగా సత్తివమ్మ పేరంటాలు తీర్థం

ఆదిరెడ్డిపాలెంలో సత్తివమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కోటాన రాము,ఎంపీటీసీ బైలపూడి దేముడు,మాజీ వైస్ ఎంపీపీ కోటాన కోటయ్య,సీనియర్ నాయకులు గోంప దేముడు,బైలపూడి సత్యం,మద్దు సూర్యనారాయణ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.

ఉమాచంద్రమౌళీశ్వరస్వామికి విశేషంగా అభిషేకాలు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి బిల్వపత్రాలతో పూజలు నిర్వహించారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈపూజలు జరిగాయి.

జాతిపితకు ఘన నివాళి



గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తదితరులు



గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయాధికారి సూర్యకళ, పాఠకులు

సింహాచలం: మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పెందుర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సత్యాగ్రహమే ఆయుధంగాను, అహింసా మార్గంలో పోరాడి యావత్ భారతజాతికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అందించిన మహనీయుడు గాంధీజీ అని ఆయన అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరూ ముందుకు నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటరావు, విస్తరణాధికారి ఎస్.అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కంచరిబోయిన సంతోష్, బొడ్డు దేవుడుబాబు, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ...

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పెందుర్తి గ్రంథాలయంలో గాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పూలమాలవేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ పోషించిన పాత్ర ఎంతో గొప్పదని ఆమె ఈసందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర శ్రీకాంత్, ఎన్నాజీరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ సంగీత విభాగంలో 3, 4 తేదీల్లో సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగంలో వచ్చేనెల 3, 4 తేదీలలో సంగీత దర్శకులు, గాయకులు సాలూరి రాజేశ్వరరావు, ఘంటశాల వెంకటేశ్వరరావులపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ఆచార్య ఎ.అనూరాధ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఘంటశాల, సాలూరి స్వరపరిచిన సంగీతంపై అతిథులు ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఈ ఇద్దరు సంగీత దర్శకులను స్మరించుకుంటూ, వారి సేవలను గుర్తుచేస్తూ భవిష్యత్ తరానికి వారి సంగీత మాధుర్యాన్ని అందించడం సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. విజయనగరం మహారాజ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు బి.ఎ.నారాయణ ఈ సదస్సులో పాల్గొని తన అనుభవాలను పంచుకుంటారన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహించనున్నారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ఇంటర్న్‌షిప్‌పై అధ్యాపకులకు శిక్షణ



మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం: ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ మేనేజ్‌మెంట్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై నాలుగో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం సోమవారం నోడల్ రిసోర్స్ సెంటర్ అయిన కృష్ణా కళాశాలలో ప్రారంభమైంది. ఈ శిక్షణ వచ్చేనెల ఒకటో తేదీ వరకూ ఉంటుందని నోడల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. విద్యార్థుల్లోని నైపుణ్యానికి పదును పెట్టి వారిలో ఉపాధికి దోహదపడే వృత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌కు దోహదపడే అంశాలను విద్యార్థులకు వివరించాలన్నారు. శిక్షణ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ నైపుణ్యంతో విద్యార్థుల ఉజ్వల భవితకు దిశానిర్దేశం చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ట్రైనర్లు శ్రీనివాస్, ప్రసాద్, విద్యాసాగర్, సిహెచ్.లలిత, కె.రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాలురకు నటనలో తర్ఫీదు



శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వీరయ్య

ఆరిలోవ: దీన్‌దయాళ్‌పురం వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నటన శిక్షణ శిబిరాన్ని గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటన ద్వారా మంచి ప్రవర్తన అలవడుతుందన్నారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఇలాంటి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిన అసోసియేషన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యఅతిథి ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ బాలలు కోసం పని చేస్తోందన్నారు. సుమారు దశాబ్దం నుంచి బాలలకు ఎన్నో శిక్షణ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ శిక్షణ శిబిరం ఇక్కడ బాలుర భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గృహం డిప్యూటీ సూపరింటెండెంట్ పి.రమణ, అసోసియేషన్ ప్రతినిధి పి.వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మునిబాబు (ఫైల్)

అల్లిపురం: అనారోగ్యంతో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. మునిబాబు (42) అనే వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరారు. అనంతరం ఈ నెల 26వ తేదీన మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.రమణమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తి 5 అడుగుల 1 అంగుళం ఎత్తు కలిగి చామనఛాయగా ఉన్నాడని, తెలుపురంగు కట్ బనియన్, సిమెంట్ కలర్ ట్రాక్ ధరించి ఉన్నాడని తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 0891-2783672, 9490391090 ఫోన్ నంబరులో తెలియజేయాలని కోరారు.

ఏయూ ముస్తాబు

- రహదారులకు మరమ్మతులు
- వైస్ చాన్స్‌లర్ల సదస్సుకు సిద్ధం



ఏయూ పరిపాలన భవనం



పరిపాలన భవనం ఎదురుగా వేస్తున్న నూతన రహదారి



సుందరీకరణ పనులు చేస్తున్న కార్మికుడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా దక్షిణ భారత విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సమావేశం మంగళవారం ప్రారంభం కానుంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, ఏయూ సంయుక్తంగా రెండు రోజుల పాటు ఈ సదస్సును నిర్వహించనున్నాయి. సదస్సును రాష్ట్ర గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్ మంగళవారం ఉదయం ప్రారంభించనున్నారు. ఏడు రాష్ట్రాలకు చెందిన వర్సిటీల వీసీలు హాజరు కానున్న నేపథ్యంలో ఏయూను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులు రెండు రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి.

- రహదారులకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు, ట్రాఫిక్ ఐలాండ్‌లు, రహదారికి ఆనుకుని ఉన్న భవనాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. ఏయూ పరిపాలనా భవనం నుంచి బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వరకు వెళ్లే వివిధ మార్గాలను సుందరీకరిస్తున్నారు. వర్సిటీలోని పరిపాలనా భవనం, జువాలజీ విభాగం, పర్యావరణ శాస్త్ర విభాగం, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగానికి వెళ్లే మార్గాలకు మరమ్మతులు చేపట్టారు.
- వర్సిటీ పరిపాలనా భవనం చుట్టు పక్కల, లోపల భాగంలో పచ్చని మొక్కలతో అలంకరించారు. పరిపాలనా భవనం చుట్టూ ఉన్న మొక్కలను ప్రూనింగ్ చేసి సుందరంగా తీర్చిదిద్దారు. నిరంతరం వర్సిటీ పారిశుధ్య సిబ్బంది రహదారులను శుభ్రం చేస్తున్నారు. విశ్వవిద్యాలయం పరిశుభ్రంగా సుందరంగా దర్శనమివ్వడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ పాసుతో ప్రవేశించిన మహిళకు జైలు శిక్ష

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోకి నకిలీ పాసుతో ప్రవేశించడానికి ప్రయత్నించిన కేసులో ఒక మహిళకు జైలు శిక్ష విధించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. 2019 జనవరి 30న పెదగంట్యాడకు చెందిన గంటా కాసులమ్మ, వేరే వ్యక్తి పాసుతో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటులో ఏ షిఫ్ట్ విధుల సమయంలో వెళ్తుండగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది పట్టుకుని పాసు తనిఖీ చేశారు. అది దొంగ పాసు అని తెలుసుకుని, స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసుకు సంబంధించిన తీర్పును సోమవారం వెలువరించారు. గాజువాక అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కాసులమ్మకు నాలుగు నెలలు జైలు శిక్ష లేదా రూ. 5500 జరిమానా విధించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే జైలు శిక్ష తప్పదని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు.

తీర్థం పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో ఫిబ్రవరి 4న నిర్వహించనున్న మాధవస్వామి తీర్థ మహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ నాయకులు బి.భగవాన్ జయరాం, సీహెచ్.ముత్యాలు, బొంది రవి, చింతకాయల అమ్మోరు, సూరాడ ఎల్లాజీ, సోమునాయుడు, వి.మాధవరావు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభానికి సన్నాహాలు



జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుతో కలిసి కల్యాణమండపాన్ని పరిశీలిస్తున్న ముమ్మన దేముడు

సింహాచలం: 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో రూ.1.60 కోట్లతో నిర్మించిన శ్రీకృష్ణ దేవరాయ కాపు కల్యాణ మండపాన్ని త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. కల్యాణమండపాన్ని జీవీఎంసీ 8వవార్డు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే కల్యాణమండపం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవానికి అనువుగా తీర్చిదిద్దేందుకు మండపం చుట్టుపక్కల ఉన్న తుప్పలను తొలగించి సుందరంగా తీర్చిదిద్దాలని జోనల్ కమిషనర్‌కి సూచించారు. మండపం వద్ద ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. ఈవారంలోనే కల్యాణమండం ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నట్టు ముమ్మన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, నాయకులు గొరపల్లి అప్పారావు, తామర్ల నర్సింగ్ బొడ్డు దేవుడుబాబు, కంచుబోయిన సంతోష్, సుంకర శేఖర్, చిక్కాల సతీష్,షణ్ముఖ్ పాల్గొన్నారు.

నేడు అప్పన్న గోశాలలో షెడ్డు ప్రారంభోత్సవం



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఈఈ శ్రీనివాసరాజు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలను మంగళవారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి సందర్శించనున్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు సొంత నిధులు రూ.16లక్షలతో నిర్మించిన నూతన షెడ్డుని ఆయన ప్రారంభించనున్నారు. ఈమేరకు సోమవారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు వై.వి.సుబ్బారెడ్డి గోశాలలో షెడ్ ప్రారభిస్తారని ట్రస్ట్‌బోర్డు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ఈఈ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మంత్రిపాలెం కోలాట బృందానికి ప్రశంసలు

తిరుమలలో శ్రీవారి రథం ముందు ప్రదర్శన



తిరుమలలో శ్రీహరి కోలాట బృందం ప్రదర్శన (ఫైల్)

అగనంపూడి: తిరుమలలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాల్లో కోలాట ప్రదర్శన చేయడాన్ని కళాకారులు అదృష్టంగా భావిస్తారు. ఆ అద్భుత అవకాశాన్ని దక్కించుకుని, దిగ్విజయంగా ప్రదర్శన ఇచ్చి, తిరిగి వచ్చారు శ్రీహరి కోలాట బృంద సభ్యులు. జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం దరి మంత్రిపాలెం గ్రామానికి చెందిన ఈ బృందం రథసప్తమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలోని మాఢ వీధుల్లో శ్రీవారి రథం ముంగిట కోలాటాన్ని ప్రదర్శించారు. భక్తుల మన్ననలు పొందడంతో పాటు ఆలయ అధికారుల ప్రశంసలు పొందారు. బృంద నిర్వాహకురాలు పచ్చికోరు వెంకట వరలక్ష్మి సారథ్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలతో పాటు తిరుచానూరులోనూ ప్రదర్శనలు ఇచ్చారు. ఇటీవల విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంతో పాటు పలు దేవాలయాలు, జాతర్లలో వందలాది ప్రదర్శనలిచ్చారు. నిర్వాహకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కోలాట ప్రదర్శన మరపురాని అనుభూతి అన్నారు.

కుష్టు వ్యాధి రహిత సమాజానికి కృషి



ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

పెదగంట్యాడ: కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యమని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పర్శ లేకపోయినా, చర్మం పాలిపోయినా, ఎరుపు రంగు మచ్చలు, చర్మం మందంగా మారడం, తిమ్మిర్లు రావడం కుష్టు వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. వచ్చే నెల 13 వరకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కుష్టు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గొంతినవాని పాలెంలోని ప్రాథమిక పాఠశాలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, ధనరాజు, జగదాంబ, ఫాతిమా బేగం, కనకరత్నం, పూర్ణిమ, కమల తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ యూనియన్ జోనల్ కమిటీ ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న కొత్త కమిటీ సభ్యులు

గోపాలపట్నం: రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ యూనియన్ జోనల్ కమిటీ ఎన్నిక స్థానిక కుమారి కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. జోనల్ కమిటీ అధ్యక్షుడిగా జంగం జోషి, గౌరవ అధ్యక్షుడిగా మమ్ముల తిరుపతిరావు, ఉపాధ్యక్షులుగా విజయనగరానికి చెందిన అల్లాడ త్రినాథరావు, అనకాపల్లికి చెందిన అలక రాజు, గాజువాకకు చెందిన ఏలేటి రోజా, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.సుగుణేశ్వరి, సహాయ కార్యదర్శిగా లోగిస గణేష్, వీరితోపాటు 9 మంది కార్యవర్గ సభ్యులు, ఈసీ మెంబర్లు, కో కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి చేత ప్రమాణ స్వీకారం, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బెహరా ఆస్పత్రి ఎండీ బెహరా రవితేజ, లోక్‌సత్తా పార్టీ నాయకుడు విశెట్టి బాబ్జి, ఫెంపా రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ ఎస్ఎల్ రావు, సంఘం న్యాయ సలహాదారులు కె.పి.దేశాయ్, ముఖ్య సలహాదారుడు మమ్ముల తిరుపతిరావు, అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ కోన ప్రకాశరావు, వి డెంటల్ కేర్ ఎండీ కె.ఎం.కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లోని స్టాళ్లకు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఆధ్వర్యంలో సోమవారం డ్రా తీశారు. ఉదయం 93 కార్డులకు, సాయంత్రం 75 కార్డులకు సంబంధించిన స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయించారు. పది రోజులకు ఒక సారి డ్రా తీస్తున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.